వేదాంతభేరి

ఫిబ్రవరి 2021

రూ. 10/-

వేదాంతభేరి

ఫిబ్రవరి 2021

రూ. 10/-



25-12-2020వ తేది శ్రీ మలయాళ సద్గురు సేవాసమాజ 50వ వార్షికోత్సవ సభలో మహాత్ముల ప్రసంగాలు

ఓం వేదాంతభేరి ఓం

సంస్థాపకులు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 54 ఫిబ్రవరి 2021 సంచిక : 02

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 2000/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు :

శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.

Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ॐ **వేదాంతభేరి** ॐ

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 54 ఫిబ్రవరి 2021 సంచిక : 02

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. శాన్తికి మార్గము -శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06
03. సద్గురు సూక్తులు - శ్రీసద్గురు మలయాళస్వాములవారు - 11
04. శ్రీరామకృష్ణ కథామృతము - శ్రీరామకృష్ణ పరమహంస - 13
05. సాధన పంచకము - శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు - 16
06. ఓ మనస్సా ! వినుమా - శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారు-20
07. శ్వేతాశ్వతరోపనిషత్తు - శ్రీ శంకర భగవత్పాదులవారు భాష్యం అనువాదం - ఆచార్య శంకరానందగిరి స్వాములవారు - 21
08. భాగవతం షష్ఠస్కంధము-శ్రీమాతా పరావిద్యానందగిరిస్వామిని-27
09. పురందరదాసు - శ్రీ డా॥సముద్రాల లక్ష్మణయ్య - 31
10. సర్వవ్యాప్త సద్గురు స్వామి- ఆచార్య జక్కంపూడి మునిరత్నం- 35
11. వార్తలు - 42

ముఖచిత్రం - అవతార పరిష్కుడు శ్రీరామకృష్ణుడు

12.2.2021వ తేది స్వామి దయానంద సరస్వతి జయన్తి
15.2.2021వ తేది మార్కండేయ జయన్తి
16.2.2021వ తేది శ్రీ పంచమి (వసంత పంచమి)
17.2.2021వ తేది శ్రీరామకృష్ణ పరమహంస జయన్తి
19.2.2021వ తేది రథసప్తమి

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

01. ఓం హృదయకమల మధ్యే రాజితం నిర్వికల్పం
సదసదఖిల భేదాతీత మేకస్వరూపమ్ ।
ప్రకృతివికృతిశూన్యం నిత్యమానందమూర్తిం
విమల పరమహంసం రామకృష్ణం భజామః ॥

02. ఓం నిరుపమమతిసూక్ష్మం నిష్ప్రపంచం నిరీహం
గగనసదృశ మీశం సర్వభూతాధివాసమ్ ।
త్రిగుణరహిత సచ్చిద్బ్రహ్మరూపం వరేణ్యం
విమల పరమహంసం రామకృష్ణం భజామః ॥

03. ఓం వితరితు మవతీర్ణం జ్ఞానభక్తి ప్రశాంతీః
ప్రణయ గలిత చిత్తం జీవదుఃఖాసహిష్ణుమ్ ।
ధృతసహజసమాధిం చిన్మయం కోమలాంగం
విమల పరమహంసం రామకృష్ణం భజామః ॥

04. ఓం స్థాపకాయచ ధర్మస్య సర్వధర్మ స్వరూపిణే ।
అవతార వరిష్ఠాయ రామకృష్ణాయ తే నమః ॥

05. ఓం ప్రేమం ఋతం త్వమచలో గుణజిత్ గుణేఢ్యో
నక్తం దివం సకరుణం తవ పాదపద్మమ్ ।
మోహాంకషం బహుకృతం న భజే యతోఽహం
తస్మాత్త్వమేవ శరణం మమ దీనబన్ధో ॥

06. ఓం భక్తిర్భగశ్చ భజనం భవభేదకారి
గచ్ఛన్త్యలం సువిపులం గమనాయ తత్త్వమ్ ।
వక్త్రోద్ధృతం తు హృది మే న చ భాతి కించిత్
తస్మాత్త్వమేవ శరణం మమ దీనబన్ధో ॥

07. ఓం తేజస్తరన్తి తరసా త్వయి తృప్తతృష్ణాః
రాగే కృతే ఋతపథే త్వయి రామకృష్ణే ।
మర్త్యామృతం తవపదం మరణోర్మినాశం
తస్మాత్త్వమేవ శరణం మమదీనబంధో ॥

శాన్తికి మార్గము

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సృష్టిలోని జీవరాసులన్నిటిలో మహాచపలమైన ఒకానొక జీవి కలదు. అదియే కోతి. ఆ కోతి ఒకనాడు కల్లు త్రాగినదట. కల్లు త్రాగి గంతులు వేయుచుండగా తేలు కుట్టినదట. తేలుకుట్టి నానా అవస్థలు పడుచుండగా దయ్యము పట్టినదట. ఇక ఆ కోతియొక్క చపలత్వము చెప్పతరమా? శాస్త్రకారులు మనస్సును ఆ విధమైన కోతికి పోల్చి చెప్పిరి. అంత మహాచపల వస్తువును దారికి తెచ్చుటెట్లు? దానిని ఒకచోట స్థిరముగా నుంచుటకు మార్గమేమి? గీతాచార్యుడీ ప్రశ్నకు సూటియైన సమాధాన మొసంగివైచెను."అభ్యాసము చేయుడు, మనస్సు లొంగి పోవును. వైరాగ్యమును చేపట్టుడు, మనస్సు దారికివచ్చును–' అని భగవానుడు చక్కని హితబోధ కావించెను.

వైరాగ్యమనగా ఇల్లు, వాకిలి విడిచి ఏకాంతమునకు బోవుట కాదు. సంసారమునకు తిలాంజలి యొసంగి కొండ గుహలో దాగుకొనుట కాదు. కుటుంబమును, వ్యవహారమును వదలివేయుట కాదు. గీతాచార్యుడా ప్రకారము బోధించలేదు. భగవద్గీతను సాక్షాత్తుగ వినిన అర్జునుడే రాజ్యమును పరిత్యజించలేదు. ఇక తక్కిన వారిమాట చెప్ప వలెనా? వ్యవహారమును మాత్రము అతడు సరిదిద్దుకొనెను. ధర్మ పూర్వకముగ సంగ్రామ మాచరించెను.

Bhagavad Geeta teaches not renunciation in action.

'గీత బోధించినది కర్మత్యాగము కాదు. కర్మయందలి కర్తృత్వ

త్యాగము, కర్మయందలి అహంభావ త్యాగము." కాబట్టి వైరాగ్య మవలంబించు వారు కర్మ త్యాగము చేసి ఎక్కడికిని పోనక్కరలేదు. వస్తువు నందలి దోషము తెలిసికొని **ఆ వస్తువు యెడల మమత్వము విడనాడుటయే వైరాగ్యము.** వస్తువు యెడల అనాసక్తి, విరాగము కలిగి యుండుటయే వైరాగ్యము. కాని బహుజన్మార్జిత వాసనా బలముచే జనుల మనస్సు ఇంద్రియార్థములగు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములపైకి ఉరుకుచున్నది. తన పుట్టిల్లగు ఆత్మయందు క్షణకాలమైనను ఉండక మనస్సు బహిర్ముఖముగ ప్రవర్తించు చున్నది. ఇక్కారణమున అది శాంతిని నోచుకొనలేకపోవుచున్నది. శాంతి నిలయమగు ఆత్మకు చేరువగుచుండుకొలది మనస్సు పరమానందమును, పరమశాంతిని అనుభవించుచుండును. దూరమగుచుండుకొలది దుఃఖమును, అశాంతిని బొందుచుండును. కాబట్టి **శాంతికి ఏకైక మార్గము బయటకు బరుగెత్తుచుండు మనస్సును లోపలికి తీసికొని వచ్చుటయే,** దానికి చక్కగ హితబోధ చేసి అంతర్ముఖ మొనర్చుటయే, బాహ్య వస్తువుల యందు గల దోషమును గూర్చి బాగుగ నచ్చచెప్పి అంతరాత్మయందు ప్రీతిని వర్ధిల్ల చేయుటయే. ఇట్టి ప్రక్రియ వైరాగ్యము వలననే సాధ్యపడగలదు.

దృశ్య వస్తువులయెడల విరాగము ఏల కలిగియుండవలెనో విచారించుట అవసరము. మానవుడు ఒక గొప్ప లక్ష్యమును సాధించుట కొఱకు ఈ దేహమును ధరించియున్నాడను సత్యమును ఎవరును విస్మరించరాదు. తన నిజస్వరూపమగు ఆత్మను అనుభూతమొనర్చుకొని, బంధవిముక్తుడై, అనాది కాలమునుండి కొనసాగుచున్న ఈ జనన మరణ రూపభీషణ సంసార పరిభ్రమణమును నిలుపుదల చేసికొని ఆత్యంతిక శాంతి సుఖములను అనుభూత మొనర్చుకొనుటకే ఈ జన్మ ఏర్పడినదని మనుజుడు మఱువరాదు. అట్టితఱి, మనస్సు ఆత్మను వదలి, బహిర్ముఖముగ జనుచు దృశ్య వస్తువులపై మోజు కలిగి నిరంతరము ఆయా పదార్థములపైననే

ప్రాలుచుండినచో ఇక ఆత్మసాక్షాత్కారమను జీవిత లక్ష్యమెట్లు కార్యాన్విత మొనర్పబడగలదు? అక్కార్యమెట్లు సాధింపబడగలదు?

Nobody can ride on two horses.

'రెండు గుఱ్ఱములపై ఒకేసారి ఎవరును స్వారి చేయలేరు.' అనాత్మపై వ్యామోహము కలిగియుండి ఆత్మను ఎవరును సాక్షాత్కరించు కొనలేరు. భోగైశ్వర్య ప్రసక్తి గల వారి చిత్తమును ఆయా విషయభోగములు హరించివైచి ధ్యానమందు నిలుకడ కలుగనీయక చేయునని గీతాచార్యుల వాక్యము.

భోగైశ్వర్య ప్రసక్తానాం తయాపహృత చేతసామ్

వ్యవసాయాత్మికాబుద్ధి స్సమాధౌ న విధీయతే (భగవద్గీత 2.44).

కావున విజ్ఞులగువారు తమ మనస్సు పరిపరివిధముల బాహ్య వస్తువులపైకి పరుగిడక ఆత్మయందు నిలుకడ కలిగి యుండుటకై విరాగమును తప్పక అవలంబించవలసియున్నది. అది యెట్లేర్పడగలదు? దానిని సాధించుటకు మార్గమేమి? దీనికి ఒకే ఒక సులభమైన పద్ధతి కలదు. వస్తువునందుగల దోషమును చక్కగ విచారించినచో ఇక మనస్సు ఆ వస్తువు యెడల విరక్తి కలిగియుండును. దానిని వాంఛింపదు. దృష్టాంతమునకు - ఒకడు పంచభక్ష్య పరమాన్నములతో గూడిన రాజ భోజనము తినుటకు ఉద్యుక్తుడై, అత్యాసక్తితో భుజించుటకు ఉపక్రమించు సమయమున ఎవడో వచ్చి 'అయ్యా! అన్నము వండునపుడు దానిలో ఒక పెద్ద పురుగు పడి చచ్చినది'- అని చెప్పినచో ఇక ఆ భోజనము నాతడు ఆరగించునా? దానిపై పూర్తిగ విరక్తి జనించును. అట్లే భోగ్య పదార్థములందుగల దోషములు తెలిసియున్నచో వానిపై జనులకు వాంఛ ఉదయించదు. దీనినే భగవానుడు 'దుఃఖ దోషాను ధర్శనము'(13-9)

అని గీతయందు వచించియున్నాడు.

అయితే, దృశ్య వస్తువులందలి ఆయా దోషములు కల్పింపబడినవి కావు. కృత్రిమములు కావు. ఊహాజనితములు కావు. అవి వానియందు స్వతః ఉండియున్నవే యగును. ఆ దోషములలో అన్నిటికంటే ప్రధానమైనది పదార్థముల నశ్వరత్వము, క్షణికత్వము. ప్రపంచములో ఎంత చక్కని వస్తువైనను కొలదికాలములో నశించిపోవుచున్నది. శాశ్వతమై, స్థిరమై, అవిచ్ఛిన్న ఆనందమును కలుగజేయునదైన వస్తువొకటియు ఈ దృశ్య ప్రపంచమున లేదు. మహామహారాజు లుద్భవించిరి. సామ్రాజ్యములు వెలసినవి. కాని అవియన్నియు కాలగర్భమున చితికిపోయి నామమాత్రా వశిష్టములైనవి. అనుభవించిన ఆ రాజులందఱు అదృశ్యులైరి. అనుభవింపబడిన ఆ భోగములన్నియు క్షీణించిపోయినవి. ఇక అట్టి క్షణిక వస్తువులకొఱకై విజ్ఞుడు పరువిడునా ? పూర్వము జనక మహారాజు ఈ ప్రకారముగనే చక్కని విచారణ చేసి సత్యమగు ఆత్మవస్తువును తెలిసికొని అసత్యమగు రాజ్యభోగాదులందు విరక్తి కలిగి, వానియందు తగులుకొన కుండ లోకమున వ్యవహరించెను.

ప్రదృశ్యతే వస్తుని యత్రదోషః న తత్ర పుంసోఽస్తి పునః ప్రవృత్తిః ।

వస్తువునందలి దోషమును తెలిసికొనినవాడు ఇక ఆ వస్తువుకొఱకై ఎన్నడును పరుగిడడు. కావున దృశ్యవస్తువునందు గల 'నశ్వరత్వము, క్షణికత్వము' అను దోషములను తెలిసికొని మనుజుడు వానిపై ఎగబడక శాశ్వత ఆత్మ కొఱకే అన్వేషించుట శ్రేయస్కరము.

ఈ సందర్భమున భర్తృహరి వచించిన చక్కని వాక్యములు ఉదాహరింపదగినవి-

రమ్యం హర్మ్యతలం న కిం వసతయే శ్రావ్యం న గేయాదికం
కిం వా ప్రాణసమాసమాగమసుఖం నైవాధిక ప్రీతయే
కిన్తు భ్రాన్త పతఙ్గపక్షపవన వ్యాలోల దీపాంకుర
చ్ఛాయా చంచలమాకలయ్య సకలం సన్తోవనాన్తం గతాః.

'నివసించుటకు పెద్ద మేడ బాగుండదా? వినుటకు చక్కని పాటలు శ్రావ్యముగా నుండవా ? దేహసంబంధ ఐహిక సుఖములు ఆనందమును గొల్పవా? ఇవియన్నియు సుఖమును గలిగించునవియే. కాని ఎంతవఱకు? అవి అనిత్యమని తెలియనంతవఱకు. ఏక్షణమందు ఆ ప్రాపంచిక సుఖములు దీపముచుట్టు తిరుగాడు మిడుతల ఱెక్కలచే కదలు అగ్నిశిఖ వలె అస్థిరమని యెఱుగుదురో ఆ క్షణమందే మహనీయులు వానియెడల విరక్తి కలిగి ఆ అల్పసుఖములను ఆశింపక పరమాత్మనే ధ్యానించుటకు ఉపక్రమించు చున్నారు.'

ఎపుడు మనస్సు ఆత్మేతర వస్తువులందు విరాగము కలిగి యుండునో, అపుడు సహజముగనే అది ఆత్మవైపునకు మఱలును. ఎపుడు బహిర్ముఖ పదార్థములను ఏవగించుకొనునో, అపుడు అంతర్ముఖ ఆత్మ వస్తువు నందు ప్రీతిగొనును. ఎపుడు ఆత్మయందు మనస్సు స్థాపితమగునో అపుడు ఉప్పుకల్లు సముద్రమునందు కరిగిపోవు విధమున మనస్సు అధిష్ఠానాత్మయందు లయమై ఆత్మాకారముగ భాసించును. అదియే మోక్ష స్థితి. అట్టి ఆత్మసాక్షాత్కారమే మానవ జీవితము యొక్క చరమలక్ష్యము. కావున సాధకుడు అభ్యాసవైరాగ్యములను రెండు మహత్తర సాధనల ద్వారా మనస్సును క్రమక్రమముగ విశుద్ధసత్త్వగుణోపేతముగ నొనర్చి దాని జన్మ స్థానమగు ఆత్మయందు విలీనము గావించి ఈ జన్మయందే మోక్ష ధామమున ప్రవేశించుటకు ప్రయత్నించవలెను.

సద్గురు సూక్తులు

- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

01. విషయము ననుభవించుచునే ఉండి ఆ విషయములందు మనో జయము గలుగవలెనని వాదించువారు నదీ ప్రవాహంలో కొట్టుకొని పోయెడి పడవలో నుండు బాలుడు దానియందుండి పడవను గట్టిగా పట్టుకొని నిలుపగోరినట్లు వ్యామోహమే గాని ఫలము గలుగదు. పడవ సముద్రములో ప్రవేశించి మునుగునట్లు వీరున్ను సంసార సాగరములో పతితులగుదురు.

02. ఒక్కొక్కరున్ను వారి వారి జీవనమునకు సాధ్యమైనంతవరకు పాపము లేని పనిని కాల సమయము తప్పక శ్రద్ధతో చేయుట ధర్మము.

03. వారి వారి జీవనయాత్రలో ఒక్క ప్రాణికైనను క్లేశము కలుగకుండు నట్లాచరించుట పరమ ధర్మము. ఇతరులకు క్లేశమును కలిగించినచో అతడు మరియొక విధముగా దుఃఖితుడగును.

04. అశాశ్వత దేహపోషణ కొఱకు సమయము నేర్పఱచుకొన్నట్లు దైవప్రార్థన, ధ్యాన జపాదులకు అనుకూల సమయమేర్పఱచుకొనుటయే మానవ జన్మనెత్తిన వారందరి ముఖ్య కర్తవ్యము.

05. అధర్మ మార్గముచే పంచభక్ష్య పరమాన్నాది వస్తువులను భుజించి జీవించుటకంటే, ధర్మ మార్గములోనుండి అంబలి కూటినీరుతో జీవించుట శ్రేష్ఠతమము. అధర్మమార్గక్షీరాన్నాదులు విషము కలిపినవని దృఢముగా నమ్ముడు.

06. సాక్షాదపరోక్ష జ్ఞానము కలిగినను యుక్తాహారము, వివిక్తవాసము, బ్రహ్మ చింతనము అను నీ రత్నత్రయమును శరీర పతన పర్యన్తము

విడువరాదు. విడిచినవాడు గురుద్రోహియగుననుట మరువకుడు.

07. సత్యము, ధర్మము, ఆత్మపారిశుద్ధ్యము అను వీటి ననుష్ఠించుటకును, ఈ మూడింటిని లోకములో నిరాటంకముగా ఉపదేశించుటకును సన్న్యాసమేర్పడినదని ఎవ్వరును మరువకుడు.

08. ఎవడు దేహేంద్రియాది సుఖములలో ఎంత ఆసక్తుడగుచున్నాడో అట్టివాడు లోకములో అంత బద్ధుడగుటయే గాక, దైవదూరస్థుడున్ను అగుచున్నాడు. ఎవడు దేహేంద్రియాది సుఖముతో ఎంత విరక్తుడగుచున్నాడో అంత లోకంలో విముక్తుడగుటయే గాక దైవ సన్నిహితుడగుచున్నాడు.

09. నీళ్ళచే నిప్పును చల్లార్చునట్లు శాంతముతో కోపమును, సత్యముచే అసత్యమును, ధర్మంచే అధర్మమును, శ్రద్ధచే ఆలస్యమును జయింపవలెను.

10. ప్రకాశముచే తమస్సును (చీకటిని) జయించునట్లు కరుణచే కాఠిన్యమును, త్యాగంచే లోభమును, విరాగంచే రాగమును, దయచే భేదబుద్ధిని జయించవలెను.

11. నావచే సముద్రమును దాటునట్లు విచారణజ్ఞానంచే సంసారమును, ధ్యానముచే మాయను, యోగంచే మనస్సును దాటవచ్చును.

12. సాధువు అనగా సాధనచతుష్టయసంపత్తి గలిగి ముక్తి పదవిని సాధించినవాడు.

13. ఒక నిమిషమైనను భగవంతుని స్మరింపక వ్యర్థమైపోవునపుడు ఎవని నేత్రములనుండి కన్నీరు ధార ధారగా ప్రవహించునో ఆ పుణ్యాత్ముడే మానవజన్మయొక్క మహిమను తెలిసినవాడనియు, యథార్థమైన దైవ భక్తుడనియు, తాను తరించి యితరులను తరింపజేయగలవాడనియు మరువకుడు. తదితరుల జన్మ భూమికి భారమని మరువకుడు.

శ్రీ రామకృష్ణ కథామృతము

- శ్రీ రామకృష్ణ పరమహంస

శ్రీరామకృష్ణులు: ఎవరు చేసిన కర్మ వారనుభవించుటయే ఈశ్వర నియమము. మిరపకాయ కొరికినచో చుర్రుమనదా? చిన్న వయసులో వాని ఫలము ఎక్కువగా తెలియదు. కాళికాలయములో దేవుని వంట చేయుటకు కట్టెలు చాల కొని ఉంచుదురు. వానిలో కొన్ని పచ్చి కట్టెలు కూడ ఉండును. పచ్చి కట్టెలు కాలుచున్నపుడు, చూచితిని-అవి తిన్నగ కాలుట మొదలుపెట్టును. బొంతకట్టెలలో నీళ్ళుండును. కట్టె కాలు కొద్దీ కట్టెలోని నీళ్ళు వెనుకకుపోవును. అటుపై తటాలున నీరు కార నారంభించి పొయ్యినే ఆర్పివేయును. కామ, క్రోధ, లోభములు- ఇవియే నీళ్ళు -అందుచేతనే వీనిపట్ల చాల జాగ్రత్తగ నుండవలెను. ఉదా॥ క్రోధవశుడై హనుమంతుడు లంకను తగులబెట్టెను. కోపము తగ్గిన పిదప అశోకవనములో సీతాదేవియున్న సంగతి జ్ఞాపకమునకు రాగా "అయ్యో! దేవికి ఎట్టి హానియు కలుగలేదు కదా!" యని వాని మనసు పరితపించెను. అందుచే కామ, క్రోధ, లోభముల బారినుండి తప్పించుకొనవలెను సుమా! సంసారములో నున్నను-భగవద్దర్శనము కలుగును, ఎల్లరకు ముక్తి కలుగును. సాధు సాంగత్యము, సర్వదా ప్రార్థన గురించి ముందే చెప్పియుండ లేదా? విలపించుచు మనోమాలిన్యమును కన్నీళ్ళతో కడగవలెను. అప్పుడే ఆయన దర్శనము లభించును. మనస్సు తుప్పు పట్టిన సూది, ఈశ్వరుడు అయస్కాంతము. తుప్పుపట్టిన సూది అయస్కాంతముచే ఆకర్షింపబడదు. అనగా, కామ, క్రోధ, లోభములతో కూడుకొనిన పాపబుద్ధి విషమ బుద్ధి. తుప్పు తీసిన వెంటనే అయస్కాంతమే సూదిని లాగుకొనును. అనగా ఈశ్వర దర్శనము కలుగును. చిత్తశుద్ధి కలిగిననే వానిని పొందగలము. జ్వరము, దానితోబాటు ఒంటిలో నీరు చేరినది. 'క్వినైను' త్రాగిన ఏమి

లాభము? సంసారములోనున్ననూ ఎందులకు భగవద్దర్శనము కాజాలదు? సాధు సాంగత్యము, విలపించుచు ప్రార్థన–అప్పుడప్పుడు ఏకాంతవాసము, భగవద్దర్శనమునకు సహాయపడును. కాలిబాటలో నాటిన చిన్న మొక్కకు నాలుగు వైపుల కంచె కట్టకపోయినచో ఆ మొక్కను ఆవులు, మేకలు తినివేయును.

అందరికి ముక్తి కలుగును. కాని గురువు ఆదేశించిన ప్రకారము నడవవలెను. పెడ త్రోవన పోయినచో తిరిగి వచ్చుట చాల కష్టము. చాల ఆలస్యముగ ముక్తి కలుగును. ఈ జన్మలో కాకపోవచ్చును. చాల జన్మములు గడచిన తరువాత కావచ్చును. జనకాది ఋషులు సంసారములో నుండి చాల పనులు చేసిరి. కాని వారు ఈశ్వరునిపై దృష్టి నిల్పియే చేసిరి. నర్తకి తల మీద బిందె పెట్టుకొని నాట్యము చేయును. (బిందె పడదు) ఉత్తరాది పడచులను చూడలేదా? తల మీద నీళ్ళ బుంగలను పెట్టుకొని గొల్ల పడచులు నవ్వుచు వేళాకోళము చేసుకుంటూ పోవుచుందురు. (బుంగలుపడవు).

భక్తుడు: గురువు ఎట్లు లభించును?

శ్రీరామకృష్ణులు: అందరును గురువులు కాజాలరు సుమా! కొన్ని రకముల కలపలు నీటిలో తేలిపోవును. వానిపై కూర్చున్నచో మనుష్యులు, పశు వులు కూడ తేలిపోవుదురు. మరికొన్ని కలపలు చాల బరువైనవి. మనుష్యులు కాలుపెట్టుట తోడనే మునిగిపోవును. కట్టెతోపాటు ఎక్కిన వ్యక్తియు మునిగిపోవును. అందుచే ఎట్టి కట్టెయో తెలిసికొని ఎక్కవలెను. ఈ కారణముచే భగవంతుడే ప్రతి యుగమందును గురు రూపమున అవతరించును. సచ్చిదానందుడే గురువు. 'ఈశ్వరుడే కర్త, మిగిలిన వారందరూ నిమిత్తమాత్రులు'. ఈ విచక్షణా బుద్ధినే జ్ఞానమందురు. నేను నిమిత్తమాత్రుడను, భగవంతుని చేతిలోని కీలుబొమ్మను మాత్రమే. అందుకే

నేను ఇట్లు చెప్పుచుందును. "తల్లీ! నేను యంత్రము, నీవు యంత్రమును నడుపుదానవు. నీవు యజమానురాలవు, నేను ఇల్లును నీవు ఇంజనీరు, నేను బండిని. ఎట్లు నడిపించెదవో అట్లే నడచెదను. ఎట్లు చేయించెదవో అట్లే చేయుదును. ఎట్లు పలికించెదవో అటులనే పలికెదను. నేనేమియు కాను, అన్నియు నీవే. సంసారములో దాసివలె ప్రవర్తింపుము.

"ఇంటిలోని పనిమనిషి పనులన్నియు చేయుచునే యుండును. కాని తన యింటి మీదనే ఆమె మనసు లగ్నమై యుండును. యజమానుని బిడ్డలను పాలించును. నా రాముడా, నా హరీ అని లాలించును. కాని, వీరు తన స్వంత బిడ్డలు కారని ఆమెకు బాగుగ తెలియును. మీరు ఏకాంతమున సాధనలు చేయుచున్నారు. ఇది చాల మంచిది. మీకు అతని కృప కలుగును. జనక మహారాజు ఏకాంతమున పెక్కు సాధనలు చేసెను. సాధనల ద్వారానే కదా సంసారములో నిర్లిప్తముగ ఉండదగును. మీరు పరుల మేలు కోరుచు ఉపన్యాసములిచ్చుచున్నారు. కాని ఈశ్వర దర్శనమునందిన పిదప ఉపన్యాసములిచ్చిన యథార్థమగు మేలు కలుగును. వాని అనుజ్ఞ బడయక ఇతరులకు బోధించుటలో ఎట్టి ప్రయోజనము కలుగదు సుమా! ఈశ్వర దర్శనము కలుగనిచో ఆయన ఆజ్ఞ లభించదు. ఈశ్వర దర్శనము కలిగిన వాని లక్షణములు వేరుగ నుండును. శుక దేవాది మహర్షుల వలె ఒకప్పుడు బాలకునివలెను, మరొకప్పుడు ఉన్మత్తునివలెను, ఇంకొకప్పుడు పిశాచి వలెను ప్రవర్తించును. శ్రీ చైతన్య దేవుడు కూడ ఒకతరి బాలుని వలెను, మరొకప్పుడు ఉన్మత్తునివలెను నృత్యము చేయును, నవ్వును, ఏడ్చును, పాట పాడును. పూరీ జగన్నాథ క్షేత్రములో శ్రీచైతన్య దేవులు ఎక్కువ కాలము సమాధి స్థితిలోనే యుండెడివారు.

సాధన పంచకము

(గత సంచిక తరువాయి) – శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

బుధజనైర్వాదః పరిత్యజ్యతామ్ ॥

ఆత్మానాత్మ వివేకము, ధర్మాధర్మ పరిజ్ఞానము గలిగిన బుధజనులతో వివాదము పరిత్యజింపబడవలెను.

శాస్త్రమును బాగుగా తెలిసికొని ఆచరించిన జ్ఞానులను బుధులందురు. ఇటువంటి వారి సన్నిధిలో తనకు తెలియనిది తెలుసు కోవడం, దానికి తగు పరిప్రశ్నాదులతో వారిని అడిగి తెలుసుకోవాలి గాని, వారితో వివాదమునకు దిగరాదు. అటువంటి వారి సన్నిధిలో తనకెంతో జ్ఞానము గలదు అని విర్రవీగి అహంకారముతో గూడి వారితో వాదన చేయరాదు. "ముఖే ముఖే సరస్వతి" అన్నారు పెద్దలు. వారు చెప్పేది మనకు తెలిసినట్లయితే, మనసులో తన జ్ఞానం సాధన సరిగా యున్నదని తెలిసికొని సంతోషించి దానికి పైన సాధింపదగినది ఏదైనా ఉందా? లేదా?అని తెలుసుకోవడం సమంజసమే. లోకంలో కొంతమంది ఏదో ఒక శాస్త్రమును తెలిసికొని అన్ని శాస్త్రాలు నాకు తెలుసునని విర్రవీగు తుంటారు. ఇటువంటి వారు విశేషమైన విజ్ఞానమును సంపాదింపలేరు. వీరు విశేషమైన విజ్ఞానము గలవారికి ఏమీ రాదని ప్రచారము చేయుదురు. వీరి దుష్ప్రచారము వలన జ్ఞానులకు వచ్చు నష్టమేమీ లేదు. మంచి "పసిడి" బంగారం, మంచి వజ్రం వాటి విలువ ప్రపంచము అంతటా ఒకే మాదిరిగానే యుంటుంది. ఈ విధంగా జ్ఞానులు సర్వధా సంతోషముగానే యుందురు. "విద్వాన్ సర్వత్ర పూజ్యతే" అని శాస్త్రము. ఇటువంటి పండితులతో వాదము చేయకూడదని శ్రీ ఆచార్యులవారు ఈ ఇరువది నాల్గవ సాధనతో తెలిపియున్నారు.

నాల్గవ శ్లోకము

క్షుద్వ్యాధిశ్చ చికిత్స్యతాం ప్రతి దినం భిక్షౌషధం భుజ్యతామ్

స్వాద్వన్నం నతు యాచ్యతాం విధివశాత్ప్రాప్తేన సంతుష్యతామ్॥

శీతోష్ణాది విసహ్యతాం నతువృథా వాక్యం సముచ్చార్యతామ్ ।

ఔదాసీన్యమభీప్స్యతాం జన కృపానైష్ఠుర్యముత్సృజ్యతామ్ ॥

ఆకలి అనే వ్యాధికి చికిత్స ఏమనగా, ఔషధమేమనగా అన్నమనే ఔషధాన్ని భుజించి ఆకలి తీర్చుకొనుము. ఏవిధమైన ఆహారము తీసుకోవలె ననగా, రుచికరమైన ఆహారమును యాచించకుము. ప్రారబ్ధవశమున లభించిన సాత్వికాహారముతో సంతోషించుము. శీతోష్ణాదిద్వంద్వములను ఓర్చుకొనుము. ఉపయోగము లేని, ప్రయోజనము లేని వ్యర్థమైన మాటను మాట్లాడకుము. ప్రతి విషయములోను కలుగజేసుకొనక ఉదాసీనముగా నుండుము. జనుల యొక్క అవమాన సన్మాన, దయ, ఆగ్రహములను విడిచిపెట్టుము అని శ్లోక భావము.

క్షుద్వ్యాధిశ్చ చికిత్స్యతామ్ ।

ఆకలి వ్యాధికి చికిత్స చేసుకొనబడవలెను అని భావం.

వ్యాధి అనగా 'రోగము' అనే యర్థము మానవులందరికి అవగతము. "ధాతురసకరణ వైషమ్యమ్ వ్యాధిః" ధాతువు, రసం, కరణం ఈ మూడింటి యొక్క హెచ్చు తగ్గుల యొక్క పరిణామము వలన గలిగిన దానిని వ్యాధి యందురు. ధాతువనగా శరీర ధారణాత్ ఇతి ధాతుః, వాత పిత్తశ్లేష్మాణః వాయువు, వాతం, పైత్యం, కపం ఈమూడింటి యొక్క వైషమ్యము వలన కలుగు ప్రకోపములే జ్వరాది రోగములుగా మారును.

ధాతువులనగా–చర్మం, మాంసం,రక్తం, నరాలు, మెదడు, క్రొవ్వు, ఎముకలు.

రసమనగా–అశితం, పీత (తినిన, త్రాగిన) ఆహార పరిణామ విశేషః రసః

కరణమనగా–చక్షురాదీంద్రియములు వీటి వైషమ్యము వలన కలుగు జ్వరాదులను రోగమందురు.

ఇంతవరకు వ్యాధి అనే పదమునకు అర్థం తెలుకొన్నాము. ఈ సాధనలో వ్యాధి అనే పదానికి ఆకలి అనే అర్థం. క్షుద్ ఏవ వ్యాధిః ఆకలి అనే వ్యాధికి చికిత్స చేసుకోమన్నారు. చికిత్స అనగా "వ్యాధి నివారణ వ్యాపారః" అని లక్షణము. వైద్యము చేయవలెను. ఆరోగ్యము బాగులేనపుడు వైద్యుని ఆశ్రయించి మందులు ఏ విధముగా వాడుకొని ఆరోగ్యవంతులు ఉన్నామో ఆ విధముగా ఆకలియనే వ్యాధికి మందు తీసుకోవలెనని శ్రీ ఆచార్యుల వారు ఇరువది అయిదవ సాధనలో తెలిపారు. ఆ మందు ఏమి తీసుకోవాలో ఇరువది ఆరవ సాధనలో చెప్పబోతున్నారు.

ప్రతిదినం భిక్షౌషధం భుజ్యతామ్

ప్రతిదినం భిక్షనే ఔషధమును భుజింపబడవలెనని భావము. భిక్ష అనే శబ్దానికి అనేకార్థములున్నవి. సేవించుట, యాచించుట, కూలి, అడుగుట, అన్నము. ఈ మొదలగు పేర్లున్నవి. ఇచ్చట అన్నము తీసుకోవలెను. "భిక్షఏవ ఔషధం" భిక్షౌషధమ్. ఆకలి అనే వ్యాధికి అన్నమనే ఔషధమును తీసుకోవలెను. "ఆకలికి అన్నము, ఔషధము" అని సామెత. అధభక్షణే "ధాతువు నుండి అత్తీతి అన్నం" అద్యతేస్మ అన్నం" అన ప్రాణనే దీనిచేత బ్రతుకుతారు. కావున అన్నం అని ఈ విధంగా అన్నధాత్వర్థములు.

అన్నము తిన్నారా, భోజనము చేశారా అని జనులు అడుగుట అందరికి విదితము. కూరపప్పులు తిన్నారా అని అడగరు. భోజనం దగ్గర మనం తినే కూర, పప్పు, సాంబారు, వడలు, పాయసం, లడ్డు, జిలేబి, అరటి మొదలగు పండ్లు – ఇవన్నీ అన్నం అనబడతాయి. అత్తీతి అన్నం ఏది తినబడుతుందో దాన్ని అన్నం అన్నారు. రోగం వచ్చినపుడు మందు ఏవిధమైన మోతాదులో వైద్యులు చెప్పిన రీతిగా సేవిస్తామో ఆ విధముగా ఆకలి అనే రోగానికి తగు ఆహారమును తీసుకోవాలి. అతిగా తీసుకోకూడదని ఇచ్చట అన్నాన్ని ఔషధశబ్దంగా చెప్పారు.

సాధకునికి అన్నం ఏవిధంగా తీసుకోవలెనో వ్యాసాదులు చెప్పుచున్నారు. "ద్వౌభాగౌ పూరయేదన్నైః తోయేనైకం ప్రపూరయేత్, మారుతస్య

ప్రచారార్థం చతుర్థమవశేషయేత్" తినే ఆహారం బుద్ధి ద్వారా ఇంత అని నిర్ణయించుకొని దానిలో అర్థం (సగ)భాగం అన్నం, పప్పుకూర, పిండి వంటలు తిని, ఒక భాగం జలంతో పూరించి, ఒక భాగం గాలిని బాగుగా పీల్చుకొనుటకు, వదులుటకు ఖాళీయుంచవలెను. మహర్షి మలయాళస్వాములవారు అందరకు ఆహారము ఈక్రింది విధముగా తీసుకోమని చెప్పారు. ఏమనగా – భోజనమునకు ముందుగా ఎవరెవరు ఏయే పనులు చేస్తున్నారో, భోజనము అయిన తరువాత గూడ ఆయా పనులు ఆయాసము లేకుండా తేలికగా చేసినట్లయితే అదే మిత భోజనము అన్నారు. మానవుడు తీసుకొనే ఆహారము గూడ మాంసాహారం, మత్తు పదార్థాలు తీసుకోకూడదు, అధికమైన కారము, పులుపు, ఉప్పు, మసాలాలు, వాడగూడదు. వీటి వలన రజోగుణము, తమోగుణం అభివృద్ధి చెంది శరీరానికి అనారోగ్యములు గలుగును. మనసు స్తిమితం లేకుండా ఆందోళనతో (టెన్షన్)తో నిండి దుఃఖమును పొందును. కనుక సాత్వికాహారమును, శాకాహారమును, పప్పులు మొదలగునవి, పండ్లు మొదలగునవి సేవించిన ఆరోగ్యముగా నుండి మనస్సు ప్రశాంతముగా నుండి సుఖమును, శాంతిని, సహనమును పొందును. "ఆహారమేవ మనః" మనము తినే ఆహారములో సూక్ష్మ భాగము మనస్సుగా మారును. స్థూలభాగము మలమూత్రాదులుగా మారును. మధ్యమ భాగము మాంసం, రక్తం మొదలగు సప్తధాతువులుగా మారును. కావున సాత్వికాహారమునే తీసుకోవలయును. భిక్ష అనే పదమునకు యాచన, భిక్షాటన అనే అర్థం గూడ వచ్చును. ఇది కేవలం సర్వసంగ పరిత్యాగులైన సన్యాసులకే వర్తించును. మరియు బ్రహ్మచారులకు వర్తించును. సాధకులకు, గృహస్థులకు, వానప్రస్థులకు సాత్వికాహారం, మిత భోజనం తీసుకొనుటుత్తమము. "తినుటకు జీవించువాడు బద్ధుడు, జీవించుటకు తినువాడు ముక్తుడు." అని మహర్షి మలయాళ స్వాములవారు చెప్పారు. ఈవిధముగా ఆకలనే వ్యాధికి అన్నమనే ఔషధమును సేవించవలెనని 26వ సాధనలో తెలిపిరి.

ఓ మనస్సా! వినుమా

\- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

'ఆత్మయే నేనను'చు మదిలోన ఎల్లపుడు భావించుచుండుమూ మనసా!
ఆత్మ చింతనచేత శక్తి సామర్థ్యములు బాగుగా కలుగునూ మనసా!

ముముక్షువైన మనుజుడు కూర్చొనుచున్నను, నడచుచున్నను, శ్వాసగైకొనుచున్నను, నిద్రించుచున్నను, చూచుచున్నను, వినుచున్నను ఎల్లవేళల "సర్వవ్యాపకమై, చేతన స్వరూపమై విరాజిల్లుచున్న 'ఆత్మయే నేను" అని స్మరణ నిధి ధ్యాసములను గావించుచుండవలెను. అట్టి ఆత్మానుసంధానముచే, దైవచింతనచే అతడు అచిరకాలములోనే స్వాత్మానుభవమును బడసి, అఖండ శక్తిసామర్థ్యములు కలిగి మహాత్ముడై చెన్నొందును. వ్యవహారమందు అమ్మనుజుడు పరోపకార పరాయణుడై, దైవకార్యనిరతుడై, నిర్మల హృదయుడై, దయార్ద్రహృదయుడై వర్తించును. ధ్యాన కాలమందు మాత్రమే కాక లోక కార్యములను నెరవేర్చునపుడు కూడ పరమశాంతి సౌఖ్యములను అనుభవించుచుండును. సమస్త చరాచరములను సాక్షాత్ భగవత్స్వరూపములుగ వీక్షించుచు ప్రాణికోటికి మేలొనరించుచుండును. చిత్తశుద్ధిని సంపాదించి నిరంతరము సమాధి జ్ఞానము కలిగియుండుచు త్రివిధావస్థల యందు ఏకరీతిగ, నిర్వికారముగ, ప్రశాంతముగ స్వస్వరూపమందు స్థిరత్వమును బడసియుండును.

కావున ఓ మనస్సా ! ఏకాగ్రబుద్ధితో, నిశ్చయబుద్ధితో ఆలకించు. నిరంతరము 'ఆత్మయే నేను' అని భావించుచుండుము. ఆత్మ యొక్క నిర్మలత్వమును, నిర్వికారత్వమును, పరమానంద స్థితిని కలిగియుండుము ప్రపంచము నందు విహరించునపుడు, పరహితతత్పరుడవై, భగవదారాధనా నిరతుడవై, దైవసేవాధురంధరుడవై వర్తించు. వ్యవహారమందును దైవ స్మరణను, ఆత్మ చింతనను వీడకు. క్షణక్షణము బ్రహ్మానుసంధానము గావించుచుండు. బ్రహ్మ చింతనచే ఆత్మ ధ్యానముచే నీవు హృదయ శుద్ధిని, అపరిమిత శక్తిసామర్థ్యములను, పరమశాంతిని పొంది తరించు. జన్మను ధన్యమొనర్చుకో.

శ్వేతాశ్వతరోపనిషత్తు - శ్రీశంకర భగవత్పాదుల వారి సంబంధ భాష్యము

అనువాదం - ఆచార్య శంకరానంద స్వాములవారు

(గత సంచిక తరువాయి)

శం.భా. - కించోపనిషత్సమాఖ్యయైవ జ్ఞానస్యైవ పరమ పురుషార్థ సాధనత్వమవగమ్యతే. తథా హి ఉపనిషదిత్యుప నిపూర్వస్య సదేర్విశరణ గత్యవసాదనార్థస్య రూపమాచక్షతే. ఉపనిషచ్ఛబ్దేన వ్యాదిఖ్యాసితగ్రన్థ ప్రతిపాద్య వస్తు విషయవిద్యోచ్యతే. తాదర్థ్యాద్ గ్రన్థోఽప్యుపనిషత్. యే ముముక్షవో దృష్టానుశ్రవిక విషయవితృష్ణాః సన్త ఉపనిషచ్ఛబ్దితవిద్యాం తన్నిష్ఠతయా నిశ్చయేన శీలయన్తి తేషామవిద్యాదేః సంసారబీజస్య విశరణాత్ వినాశాత్ పరబ్రహ్మగమయితృత్వాద్ గర్భ జన్మజరా మరణాద్యుపద్రవావసాదయితృత్వాదుపనిషత్ సమాఖ్యయాప్యన్యకృతాత్పరం శ్రేయ ఇతి బ్రహ్మవిద్యోపనిషదుచ్యతే.

అనువాదం - ఉపనిషత్తంటే జ్ఞానసాధనలో పరమ పురుషార్థమని తెలియబడుచున్నది. ఎలాగంటే ఉపనిషత్తను శబ్దం ఉప మరి ని అను ఉపసర్గలపూర్వక విశరణ గతి అవసాదనలను అర్థాన్నిచ్చే సద్లృ ధాతువు చేత ఏర్పడింది. ఉపనిషత్తను శబ్దం చేత వ్యాఖ్యానం చేయబోయే గ్రంథ ప్రతిపాద్యవస్తువిషయక విద్యయని చెప్పబడుతుంది. ఆ యర్థాన్ని బోధించేది కాబట్టే గ్రంథం గూడ ఉపనిషత్తని చెప్పబడుతుంది. ముముక్షువులైనవారు ఇహ, పరలోక విషయాలయందు సంపూర్ణ వైరాగ్యం గలిగి ఉపనిషద్విద్యను అత్యంత తన్నిష్ఠులై నిశ్చయంగా విచారించుటచే సంసార బీజమైన అవిద్యాదులను నశింపజేసి, బ్రహ్మ పదమును పొందింపజేసినందున, గర్భవాస జన్మ జరామృత్యువులను ఉపద్రవాల

నుండి సడలింపు (తగ్గింపు) చేయుట వలన దీనిని ఉపనిషత్తంటారు. ఈ పేరుతో గూడ అన్య ఇతర సాధనలకంటే శ్రేయస్కరమగుటచే బ్రహ్మవిద్యయే ఉపనిషత్తని చెప్పబడుతుంది.

శం.భా. -పూర్వ పక్షము-నను భవేదేవముపనిషదారంభో యది విజ్ఞానస్యైవ మోక్షసాధనత్వం భవేత్. న చైతదస్తి. కర్మణామపి మోక్షసాధనత్వావగమాత్ "అపామ సోమమమృతా అభూమ" "అక్షయ్యం హ వై చాతుర్మాస్యయాజినః సుకృతం భవతి" ఇత్యాదినా.

అనువాదం - ఒకవేళ విజ్ఞానమే మోక్షసాధనమని అంటే అలా అనేదానికి వీలు లేదు. ఎందుకంటే "మేము సోమపానం చేశాము" "చాతుర్మాస్య వ్రతం చేసేవారికి అక్షయ పుణ్యఫలం లభిస్తుంది" ఇత్యాది వాక్యాల ద్వారా కర్మలు గూడ మోక్షసాధనలుగా స్వీకరించబడినవని అంటావేమో అలా కాదు.

శం.భా. సిద్ధాంతము- నత్వేతదస్తి. శ్రుతి స్మృతి విరోధాత్ న్యాయ విరోధాచ్చ. శ్రుతి విరోధః తావత్ - "తద్యథేహ కర్మజితో లోకః క్షీయతే ఏవమేవా ఽ ముత్ర పుణ్యజితో లోకః క్షీయతే " (ఛాం. ఉ.) "తమేవం విద్వానమృత ఇహ భవతి" (నృసింహ. పూ. ఉ.) "నా ఽ న్యఃపన్థాః విద్యతే ఽ యనాయ" (శ్వేత. ఉ) "న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః" (కైవల్య) "ప్లవా హ్యేతే అదృఢా యజ్ఞరూపా అష్టాదశోక్తమవరం యేషు కర్మ. ఏతచ్ఛ్రేయో యే౽ భినన్దన్తి మూఢా జరామృత్యుం తే పునరేవాపియన్తి" (ముండ. ఉ) "నాస్త్యకృతః కృతేన" (ముం. ఉ.)

"కర్మణా బధ్యతే జన్తుర్విద్యయా చ విముచ్యతే ।
తస్మాత్కర్మ న కుర్వన్తి యతయః పారదర్శినః॥"

"అజ్ఞానమూల పూర్ణత్వాత్ పురాణో మలినః స్మృతః ।
తత్క్షయాద్వై భవేన్ముక్తిః నా ఽ న్యథా కర్మకోటిభిః ॥"

"ప్రజయా కర్మణా ముక్తిర్ధనేన చ సతాం న హి ।
త్యాగేనైకేన ముక్తిః స్యాత్తదభావే భ్రమన్త్యహో ॥ "

"కర్మోదయే కర్మఫలానురాగాః తథా ఽ నుయన్తి తరన్తి మృత్యుమ్"
"జ్ఞానేన విద్వాంస్తేజ అభ్యేతి నిత్యం న విద్యతే హ్యన్యథా తస్య పన్థాః"
"ఏవం త్రయీ ధర్మమనుప్రపన్నా గతాగతం కామకామా లభన్తే"(భ. గీ.)

"శ్రమార్థమాశ్రమాశ్చా౽ పి వర్ణానాం పరమార్థతః "
"ఆశ్రమైర్న చ వేదైశ్చ యజ్ఞైః సాంఖ్యైః వ్రతైస్తథా ।
ఉగ్రైస్తపోభిర్వివిధైర్దానైర్నానా విధైరపి ।
న లభన్తే తమాత్మానం లభన్తే జ్ఞానినః స్వయమ్ "

"త్రయీధర్మ మధర్మార్థం కిం పాకఫలసంనిభమ్ ।
నాస్తి తాత సుఖం కించిదత్ర దుఃఖశతాకులే ॥
"తస్మాన్మోక్షాయ యతతా కథం సేవ్యా మయా త్రయీ ।
అజ్ఞానపాశబద్ధత్వాదముక్తః పురుషః స్మృతః"

"జ్ఞానాత్తస్య నివృత్తి స్యాత్ ప్రకాశాత్తమసో యథా ।
తస్మాత్జ్ఞానేన ముక్తిః స్యాదజ్ఞానస్య పరిక్షయాత్ "

'వ్రతాని దానాని తపాంసి యజ్ఞాః సత్యం చ తీర్థాశ్రమ కర్మయోగాః
స్వర్గార్థమేవాశుభమధ్రువం చ జ్ఞానం ధ్రువం శాన్తికరం మహార్థమ్॥

ప్రయత్నం చేసే నేను వేద ధర్మాలను ఎలా అనుసరించాలి?' 'అజ్ఞాన పాశబద్ధుడైనందున జీవుడు ముక్తుడు కాలేడని చెప్పబడింది.' ప్రకాశంచేత చీకటిపోయినట్లు జ్ఞానంచేతనే అజ్ఞాన నివృత్తియని చెప్పబడింది. జ్ఞానంచేత అజ్ఞాన నివృత్తి కలిగినందున ముక్తి కలుగుతుంది.' 'వ్రతాలు, దానాలు, తపస్సులు, యజ్ఞాలు, సత్యం, తీర్థ, ఆశ్రమ, కర్మయోగాలన్నీ అశుభము, అనిత్యమైన స్వర్గానికి కారణాలు మాత్రమే. జ్ఞానం నిత్యమైన శాంతికి పరమార్థ స్వరూపం.' 'మానవుడు కర్మలచేత దేవత్వాన్ని, తపస్సుచేత బ్రహ్మ లోకాదులను, దానంచేత రకరకాల భోగాలను, జ్ఞానంచేత మోక్షాన్ని బొందుతాడు.' 'ధర్మరజ్జువుచేత జీవుడు ఊర్ధ్వగతిని, పాపరజ్జువుచేత అధోగతిని బొందుతాడు. ఈరెంటిని జ్ఞానమనే ఖడ్గంచేత ఛేదించి పరమ శాంతిని పొందుతాడు.' 'ధర్మాధర్మాలను, సత్యానృతాలను త్యాగం చేయి. సత్యానృతాలను త్యాగంచేసి దేనిచేత వీటిని త్యజిస్తున్నావో దానిని గూడ త్యాగం చేయి.

ఈవిధంగా శ్రుతిస్మృతులకు, యుక్తులకు విరోధమయినందున అమృతత్వం కర్మ సాధ్యం కానేరదు. ఒకవేళ మోక్షం కర్మసాధ్యమయితే చతుర్విధ క్రియలకు అంతర్భూతమగుటచే మోక్షం గూడ అనిత్యమని చెప్పబడుతుంది. ఏది కర్మజన్యమో అది అనిత్యమని చెప్పుటచే కర్మసాధ్యమైన మోక్షం గూడ అనిత్యమవుతుంది. మోక్షం నిత్యమని సర్వదార్శనికులు అంగీకరిస్తారు. అలాగే చాతుర్మాస్య ప్రకరణంలో 'ఓ మానవులారా! నీవు తిరిగి పుత్రరూపంలో పుడతావు. ఇదే నీయొక్క అమరత్వమని శ్రుతి చెప్పింది. (అక్షయ్యం వై చాతుర్మాస్య యాజినః సుకృతం భవతి) అను ఈ శ్రుతిలో సుకృతం అక్షయమని చెప్పింది. సుకృతమనే శబ్దం కర్మయను అర్థంలో చెప్పబడింది. **(సశేషం)**

భాగవతం షష్ఠ స్కంధము

- శ్రీ మాతా పరావిద్యానందస్వామిని (గత సంచిక తరువాయి)

దుర్గములు, అడవులు, రణరంగములు మొదలగు సంకట స్థానముల యందు దైత్య సంహారకుడు, తన భీకరమైన అట్టహాసముతో దైత్యస్త్రీల గర్భములను జార్చిన నృసింహప్రభువైన శ్రీహరి నన్ను రక్షించుగాక!

యజ్ఞ వరాహమూర్తిగా అవతరించి తన దంతములపై భూమిని ధరించిన శ్రీహరి నన్ను మార్గమున రక్షించుగాక! అంతియే గాక పర్వతములపై పరశురాముడుగా, ప్రవాసకాలమున లక్ష్మణునితో కూడిన భరతాగ్రజుడైన శ్రీరామచంద్రుడిగా నన్ను రక్షించుగాక !

అభిచార హోమముల నుండి, భయంకరమైన మారణ హోమముల నుండి మరియు అన్నివిధములైన ప్రమాదముల నుండి శ్రీమన్నారాయణునిగా రక్షించుగాక! ఋషి శ్రేష్ఠుడైన నరునిగా నా గర్వమును దూరము చేయును గాక! యోగేశ్వరుడైన దత్తాత్రేయునిగా యోగవిఘ్నముల నుండి రక్షించుగాక! కర్మబంధముల నుండి త్రిగుణాధిపతియైన కపిల భగవానునిగా రక్షించుగాక!

సనత్కుమారుడు నన్ను కామదేవునినుండి మార్గములందు సంచరించునపుడు దేవతామూర్తులను నమస్కరించకుండుట మొదలైన అపరాధములనుండి హయగ్రీవుడు, భగవంతుని పూజ చేయునపుడు జరుగు అపరాధముల నుండి దేవఋషియైన నారద మహర్షి, అనేక విధములైన నరక బాధలనుండి కూర్మావతారుడైన శ్రీహరి రక్షించుగాక!

అనారోగ్యములనుండి ధన్వంతరి భగవానుడు, సుఖదుఃఖాది భయంకర బాధలనుండి జితేంద్రియుడైన ఋషభదేవుడు, లోకాపవాదముల

నుండి యజ్ఞపురుషుడైన నారాయణుడు, మానవుల వలన కలుగు కష్టముల నుండి బలరాముడు, క్రోధమను సర్ప గణములనుండి ఆదిశేషుడు నన్ను రక్షించుగాక!

అజ్ఞానవశమున నేను చేయు కార్యములనుండి వ్యాసభగవానుడు, పాషండగణములనుండి మరియు ప్రమాదములనుండి బుద్ధుడు, కలికాల దోషములనుండి ధర్మరక్షణ కొరకు అవతారమును దాల్చిన కల్కిభగవానుడు నన్ను రక్షించుగాక!

ప్రాతః కాలమున కేశవుడు తన గదాయుధముతోడను, సూర్యోదయానంతరము (అసంగవ కాలమున) వేణుగాన లోలుడగు గోవిందుడు, నారాయణుడు, పూర్వాహ్నమున తీవ్రమైన శక్తిని ధరించి మరియు మధ్యాహ్న కాలమున సుదర్శన చక్రమును ధరించి విష్ణు భగవానుడు నన్ను కాపాడుచుండును గాక !

అపరాహ్ణకాలమున ప్రచండమైన తన ధనుస్సును ధరించి మధుసూదనుడు, బ్రహ్మ విష్ణు మహేశ్వర రూపముతో సాయంకాలము నందు మాధవుడు, హృషీకేశుడుగా సూర్యాస్తమయమయిన తరువాత మరియు పద్మనాభునిగ అర్ధరాత్రమున నన్ను రక్షించుగాక !

శ్రీవత్స శోభితుడైన శ్రీహరి అపరరాత్రియందు, ఖడ్గధారియైన జనార్ధనుడు ఉషఃకాలమున, సూర్యోదయమునకు పూర్వము దామోదరుడు, ఉషః కాలానంతరము ప్రభాతవేళ విశ్వేశ్వరుడై నన్ను కాపాడుచుండును గాక!

సుదర్శన చక్రము తీవ్రమైన అంచులు గలిగి ప్రళయ కాలాగ్నిని విరజిమ్ముచూ భగవత్ప్రేరణచే తిరుగుచుండును. అట్టి చక్రము వాయువు

తోడగుట వలన అగ్ని ఎండుగడ్డిని కాల్చివైచునట్లు మా శత్రు సైన్యములను త్వరితముగా కాల్చివైచును గాక !

ఓ కౌమోదకీ గదాయుధమా నీ నుండి బయల్వెడలు అగ్ని కణములు వజ్రాయుధముయొక్క దెబ్బవలె దుర్భరముగ వుండును. నీవు అజితుడైన శ్రీహరికి ప్రియమైన దానివి. నేను ఆ ప్రభువునకు సేవకుడను. అందువలన నీవు కూష్మాండ వినాయక, యక్షరాక్షసభూతప్రేతాది గణములను, నా శత్రువులను ఇపుడే పిండి పిండి గావింపుము !

ఓ శ్రేష్ఠమైన పాంచజన్య శంఖమా! శ్రీకృష్ణ భగవానునిచే పూరింపబడి భీకరమైన శబ్దమొర్చుచు శత్రువుల హృదయములను కంపింపజేయు నీవు భయంకరమైన రాక్షసులను, ప్రమథ గణములను, ప్రేతములను, మాతృకలను, పిశాచములను, బ్రహ్మరాక్షసులను వెంటనే పారద్రోలుము.

ఓ శ్రీహరికి ప్రీతిపాత్రమైన నందకమను ఖడ్గమా! నీ అంచులు చాలా తీక్ష్ణమైనవి. భగవంతునిచే ప్రయోగింపబడిన నీవు శత్రువులను ఛేదించుము. నీయందు గల వందలకొలది చంద్రుని వంటి మండలాకారములతో శత్రువుల పాపదృష్టిని హరించి వేయుము.

మా శ్రేయస్సుకు విరోధులయిన సూర్యాది గ్రహములు, ధూమకేతువులు, దుష్టమానవులు, సర్పాది విషప్రాణులు, కోఱలు గల క్రూర మృగములు, భూతప్రేతాదులు మొదలైన పాపాత్ములగు ప్రాణులు అన్నియు భగవంతుని నామ రూపములను, ఆయుధములను కీర్తించుట వలన వెనువెంటనే నశించునుగాక!

ప్రభువు, పూజ్యుడు, వేదమూర్తి బృహద్రథంతరము మొదలగు

సామములచే స్తుతింపబడు గరుత్మంతుడు కష్టములనుండి నన్ను రక్షించును గాక! పార్షదుడైన విష్వక్సేనుడు తన నామోచ్చారణ ప్రభావముచే నన్ను కాపాడుచుండును గాక ! కార్యకారణ రూపమగు ఈ ప్రపంచమంతయూ భగవత్స్వరూపమే కనుక అతని సత్య ప్రభావముచే మా ఉపద్రవములన్నియు నశించుగాక!

అద్వైత సిద్ధిని పొందిన మహానుభావులకు భగవంతుడు నామరూప రహితుడు, ఆత్మ స్వరూపుడు. అయిననూ భగవంతుడు తన మాయాశక్తి ద్వారా నానావిధ రూపములతో, నామములతో ఆభరణములను, ఆయుధములను ధరించుచూ సర్వవ్యాపకుడైన శ్రీహరి సదా సర్వత్రా అన్ని విధముల నామరూపములతో కూడిన మమ్ములను తన అన్ని రూపములతో రక్షించుచుండును గాక !

తన భయంకరమైన అట్టహాసముచే జనులను భీతిల్లి పారి పోవునట్లు చేయు నారసింహుడు తన దివ్యతేజస్సుచే అందరి తేజస్సులను స్వాధీనమొనర్చుకొనును. అట్టి నారసింహుని రూపుడైన శ్రీహరి దశదిశల యందును, లోపలను, వెలుపలను మమ్ము రక్షించుచుండును గాక!

ఈక్రిందివారు త్రినేత్ర వైద్యాలయ ట్రస్టు
(కంటిఆసుపత్రికి) నిధికి పైకం ఇచ్చినారు

సవరణ : ఎస్.అరతిగారు (సికింద్రాబాద్) ఇరవై వేల రూపాయలు ఇచ్చినారు. పదివేలు కాదు. పొరబాటుకు చింతిస్తున్నాము.

(1). లింగారెడ్డి శారదమ్మ గారు (రామారెడ్డిపాళెం) - రూ. 40,000/-
(2). లింగారెడ్డి సుధాకర్ గారు (మీంజూరు) - రూ. 10,000/-
(3). కె.ధర్మాంగదుడు (తాడేపల్లి - గుంటూరుజిల్లా) - రూ. 25000/-
(4). ఎస్.విశ్వసాయికృష్ణ (హైద్రాబాద్) - రూ. 10,000/-
(5). పి.లక్ష్మణమూర్తి (విశాఖపట్నం) - రూ. 10,000/-

పురందరదాసు

- డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

మోక్షమనే సౌధం నాలుగు స్తంభాల మీద నిలబడియున్నది. కర్మ-భక్తి-ధ్యాన- జ్ఞాన యోగాలే ఆ స్తంభాలు. ఇందులో భక్తియోగం ఈ కాలానికి మిక్కిలి అనుకూలమైనది.

"కలౌ భక్తిః కలౌ భక్తిః భక్త్యా కృష్ణః పురః స్థితః"అన్నట్లు భగవత్సాక్షాత్కారం భక్తితో సులభంగా సిద్ధిస్తుంది.

భక్తిలో తొమ్మిది భేదాలున్నాయి. శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం -అనేవే ఆ భేదాలు. అందులో రెండవదైన కీర్తన మార్గం అత్యంత ప్రశస్తమైనది.

'నామ సంకీర్తనం యస్య సర్వపాప ప్రణాశనమ్' అని భాగవతం నామ సంకీర్తనం చేత సకల పాపాలూ శమిస్తాయని చెప్పింది.

సంకీర్తన మార్గ ప్రశస్తిని వివరిస్తూ "భగవతః శ్రీమన్నారాయణస్య నామోచ్చారణ మాత్రేణ నిర్ధూతకలిర్భవతి" అని కలి సంతరణోపనిషత్తు పేర్కొన్నది. నామసంకీర్తనంతో కలి దోషం తొలగుతుందని భావం.

పూర్వకాలంలో నారదుడు నామసంకీర్తన పద్ధతి నాశ్రయించిన వారిలో ప్రముఖుడుగా పురాణ వాఙ్మయం నుండి తెలుస్తున్నది. ఈ కాలంలో కూడ అన్నమాచార్యులవారు, పురందరదాసు, త్యాగరాజు, క్షేత్రయ్య మున్నగువారు వాగ్గేయకారులుగా, సంకీర్తనాచార్యులుగా, సంగీత సాహిత్య కళానిష్ణాతులుగా ప్రశస్తి పొందారు.

వారిలో -పురందరదాసు గురించి సంగ్రహంగా తెలుసుకొందాం. ఈ భక్తాగ్రేసరుడు 1484- 1564 సంవత్సరాల మధ్య జీవించినట్లు

తెలుస్తున్నది. ఈయన జన్మించిన గ్రామం పేరు పురందర పల్లె. ఇందులో అభిప్రాయ భేదాలు గూడా ఉన్నాయి.

ఈ మహనీయుని తల్లిదండ్రులు కమలాంబ, వరదప్పనాయక అనేవారు. పురందరదాసుకు చిన్నతనంలో తల్లిదండ్రులు పెట్టిన పేరు 'శ్రీనివాసనాయక' అని. వారిది సంపన్న కుటుంబం. నగల వ్యాపారిగా వరదప్పనాయకుడు మితిమీరిన ధనం ఆర్జించాడు. శ్రీనివాస నాయకుడు బాల్యం నుడే నగల వ్యాపారంలోని మెలకువలను గ్రహించాడు. యౌవనం ప్రాప్తించగానే అతడు సరస్వతీభాయ్ అనే కన్యను ధర్మపత్నిగా స్వీకరించాడు. ఆమె సుగుణవతి, దయార్ద్రహృదయం కల ఇల్లాలు. పేదల పట్ల కనికరం చూపేది. వారికి నల్గురు కుమారులు, ఒక కుమార్తె సంతానం.

వరదప్ప మరణానంతరం వ్యాపార బాధ్యతలను శ్రీనివాస నాయకుడు స్వీకరించాడు.

అతడు సంపన్నుడైనా త్యాగగుణం కలవాడు కాదు. సదా ఆర్జన మీదనే దృష్టి కల్గి యుండేవాడు. మితిమించిన ఆర్జనతో "నవకోటి నారాయణుడు'గా ప్రశస్తిపొందాడు. యాచకులను దగ్గరకు రానిచ్చేవాడు కాదు.

ఒకనాడు అతని చెంతకు ఒక విప్రుడు వచ్చి తన కుమారునికి ఉపనయనం నిర్వహించడానికి కొంత ఆర్థిక సహాయం కావాలన్నాడు. శ్రీనివాస నాయకుడు "రేపు రా " అంటూ కొన్ని రోజులతణ్ణి రాకపోకలకు గురి చేశాడు.

విసుగు చెందిన విప్రుడు శ్రీనివాస నాయకుని భార్య చెంతకు వెళ్ళి సాయం కోరాడు. ఆమె గూడా తన వద్ద ఏమీ లేదన్నది. "నీ ముక్కు పుడక ఉన్నది గదా!" అని విప్రుడన్నాడు. వెంటనే ఆ దయామయి ముక్కు పుడక నతనికి దానం చేసింది.

ఆ విప్రుడు శ్రీనివాసనాయకుని వద్దకా పుడకను తీసుకుపోయి దానికి వెలకట్టి డబ్బిమ్మన్నాడు. దానిని పరీక్షించి తన భార్య ముక్కు పుడక అని శ్రీనివాస నాయకుడు గ్రహించాడు. వెంటనే యింటికి పోయి భార్య ముక్కు పుడక ఇంటిలో లేదని తెలుసుకొన్నాడు. ఈ విషమ పరిస్థితిలో సరస్వతీభాయి విషం నింపిన పాత్రను తీసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించగా ఆ పాత్రలో ముక్కు పుడక కనిపించింది. ఆమె సంతోషాని కవధిలేదు. వెంటనే భర్తకు ఆభరణం చూపింది. శ్రీనివాసనాయకుడు వెంటనే నగల షాపుకు వెళ్ళి అక్కడ ఆభరణం లేదని గ్రహించాడు. ఆశ్చర్యపడి యింటికివచ్చి భార్య నుండి జరిగిన సంఘటనంతా తెలుసు కొన్నాడు. అప్పుడు ధనసహాయం కోసం వచ్చిన ద్విజుడు భగవంతుడే అన్న విశ్వాసం అతనికి కలిగింది.

ఆ క్షణం నుండి అతని జీవిత విధానం పూర్తిగా మారిపోయింది. భగవత్సేవకు తన జీవితాన్ని అంకితం చేశాడు. ఐశ్వర్యం మీద తీవ్ర విరక్తి కల్గింది. తన సర్వస్వాన్నీ దీనానాథ జనులకు సమర్పించి నిరుపేదగా జీవించాడు. ఆతని భార్య అన్ని విధాలా ఆయనకు సహకరించింది.

ఒకసారి దంపతులు హంపికి వెళ్ళారు. అక్కడ శ్రీవ్యాసరాయలును సందర్శించి శ్రీనివాస నాయకుడు ఆయన అనుగ్రహానికి పాత్రుడయ్యాడు. 'దాస' జీవితాన్ని అవలంబించి భగవద్భావనలో కాలం గడిపాడు. భక్తి ప్రచారం కావించాడు.

భగవంతునిపై నాలుగు లక్షలకు పైగా సంకీర్తనలను కన్నడ భాషలో రచించాడు. అందులో ఇప్పుడు కొన్ని కీర్తనలు మాత్రమే లభిస్తున్నవి. నవవిధ భక్తి మార్గాలలో సంకీర్తన మార్గమే ఆయనకు అనుసరణీయ మయింది. హరినామ ప్రచారం తన జీవిత లక్ష్యంగా భావించాడు. ఆ లక్ష్యాన్ని సాధించాడు. పురందర విట్ఠల నామసంకీర్తనచే 'పురందరదాసు'గా ప్రసిద్ధుడయ్యాడు.

అన్నమాచార్యుల కంటె వయస్సులో చిన్నవాడైన పురందరదాసు అన్నమయ్య సంకీర్తనలు విని ఆయన భక్తికి మెచ్చి ఆయనను అపర వేంకటేశ్వరునిగా భావించాడు. వారిరువురి కలయిక సన్నివేశాన్ని అన్నమయ్య మనుమడు చిన్నన్న ఇలా వర్ణించాడు.

విని కనియును లోన వెఱగందికొనుచు

చని తాళ్ళపాక శాసనుడన్నమయ్య

వెన్నునిగానె భావించి కీర్తించి

సన్నుతిసేయ నాచార్యవర్యుండు

నతని విట్ఠలునిగా ననయమ్ము దలచి

ప్రతి లేని గతుల సంభావించెనప్పుడు (అన్నమాచార్య చరిత్ర నుండి)

పురందరదాసు జీవితంలో అతని భక్త్యతిశయాన్నీ, అతని పట్ల గల భగవదనుగ్రహాన్నీ సూచించే, అపూర్వ మహిమలను తెలిపే సందర్భాలు అనేకం ఉన్నాయి. వారి జీవిత చరిత్ర నుండి ఆ విషయాలను పాఠకులు గ్రహించవచ్చు.

పురందరదాసు గారి కీర్తనలు కర్ణాటక దేశంలో నేటికీ బహుళ ప్రచారంలో ఉన్నాయి. ఆ భక్తాగ్రేసరుడు మతద్వేషాలకు అతీతంగా జీవించాడు. విషమ భావం ఏ మాత్రం లేకుండా సమదృష్టి గలిగి జీవించాడు. మధ్వాచార్యులు ప్రచారం చేసిన ద్వైత వేదాంతాన్ని ప్రధానంగా స్వీకరించినప్పటికీ అద్వైత -విశిష్టా ద్వైతాల పట్ల సౌజన్యంతోనే మెలగినాడు.

నిమ్న జాతి వారిని గూడా సమదృష్టితో ప్రేమించాడు. కులంకంటె గుణమే మిన్నయని విశ్వసించాడు. కుల మత ద్వేషాలతో కుమిలిపోతున్న మన సమాజానికి శ్రీపురందరదాసు వంటి సర్వసమభావ సంపన్నులైన మహానుభావులు చూపిన మార్గమే అనుసరణీయం.

సర్వవ్యాప్త సద్గురు స్వామి

ఆచార్య జక్కంపూడి మునిరత్నం (తిరుపతి)

ఉ. శ్రీ గురుసత్పరంపరకు శీర్షమనందగ నొప్పి పెంపునన్
బాగుగ నార్షధర్మము కృపన్ పరివ్యాప్తమొనర్చి భూమిపై
మూగిన చీకటిన్ దరుమబూనిన జ్ఞానసరోజ బాంధవున్
వాగమలప్రసూనముల భక్తి సమర్చితుజేతు సద్గురున్

కం. ఎరుకగలవారి చరితలు
గరచుచు సజ్జనుల గోష్ఠి కదలక ధర్మం
బెరుగుచు నెరిగిన దానిని
మరువకనుష్ఠంచునది సమంజస బుద్ధిన్. (**శ్రీ మదాంధ్రమహాభారతం ఆది పర్వం, మూడవ ఆశ్వాసం, పద్యం 303**). యయాతి మహారాజు తన కుమారుడు పూరుడికి రాజ్యాధికారాన్ని అప్పగిస్తూ కొన్ని నీతులు చెప్పాడు. వాటిలోనిదే ఈ పద్యం. ఈ పద్యంలో నాలుగంశాలున్నాయి. మొదటిది జ్ఞానుల చరిత్రలను చదువడం కాదు, వినడం కాదు, నేర్చుకోవడం. అలా నేర్చుకొంటే అవి బాగా ఒంటబట్టుతాయి. వారిని ఆదర్శంగా పెట్టుకొని జీవితాన్ని మలచుకోవచ్చు. రెండది సర్వదా సజ్జన సహవాసంలో గడపడం. అలా చేస్తే దుష్ప్రభావం మనమీద పడదు. మూడవది వారి ద్వారా ధర్మాలు తెలుసుకోవడం. నాలుగవది తెలుసుకున్న దాన్ని మరచిపోకుండా గుర్తుపెట్టుకొని అనుష్ఠించడం. ఇవన్నీ పూరుడికి మాత్రమే గాక మనకందరికీ కూడా వర్తిస్తాయి. దీన్ని ఆధారం చేసుకొని మహర్షి సద్గురు మలయాళ

స్వాముల వారిని గురించి ఆలోచించడం ఎంతో ఆసక్తిదాయకం.

యయాతి చెప్పిన దానికి సజీవ వ్యాఖ్యానంగా సద్గురు స్వాములవారు గోచరిస్తారు. ఇక్కడ రెండు విధాలుగా ఆలోచించేందుకు అవకాశం ఉంది. మొదటిది స్వాములవారు పాటించిన వైనం. రెండవది యయాతి చెప్పినట్లు స్వాములవారి నాధారం చేసుకొని మనమనుసరించవలసిన విధానం. వారి జీవితాన్నీ, బోధనలనూ దృష్టిలో పెట్టుకొని ఆలోచిస్తే సద్గురు స్వాములవారు కూడా యయాతి వాక్యాలను పాటించినట్లే కనిపిస్తుంది. స్వాములవారు చిన్నప్పటి నుంచీ గౌతమబుద్ధుడు, శంకరభగవత్పాదులు మొదలైన మహనీయుల గురించి విని ఉండవచ్చు. వారిలాగా తాము కూడా మనుగడ సాగించాలని భావించి ఉండవచ్చు. అది మహర్షుల గోష్ఠి వారికి సాధ్యమే. ఎలాగంటే మహర్షులు భౌతికంగా లేకపోయినా వారి కృతులున్నాయి. వాటిలో వారి గొంతూ, హృదయము రవళిస్తూనే ఉంటాయి. బ్రహ్మసూత్రాలు, భగవద్గీత, ఉపనిషత్తులు, పురాణాలు, తదితర ఆర్ష వాఙ్మయమూ స్వాములవారికి హృదయస్థాలు. అందువల్ల శ్రీవారికి వాటి కర్తలతో నిత్య గోష్ఠి సాగుతూనే ఉంటుందనడంలో సందేహమక్కరలేదు. తాము తెలుసుకున్న ధర్మాలను అనుష్ఠించడంలో వారికి వారే సాటి అనడంలో ఎటువంటి సంశయమూ ఉండనక్కరలేదు. వారి అనుష్ఠాన ప్రీతికి వారి శ్లోకమే చక్కని ఉదాహరణ.

"నానుష్ఠానాత్పరో ధర్మః త్రిషు లోకేషు విద్యతే

సత్యం సత్యం పునస్సత్యం ఇతి మామక భాషణం" పైగా శ్రీవారు ఎప్పుడు మాట్లాడినా ఎక్కడ మాట్లాడినా అనుష్ఠానాన్నే ఉద్ఘాటించేవారని వింటున్నాము. వారి రచనల్లో గూడా ఇదే గోచరిస్తూ ఉంది.

సద్గురు మహర్షి మలయాళస్వాములవారి జీవిత చరిత్రను గమనిస్తే యయాతి సూచించిన జ్ఞానుల చరిత్రనడానికి సందేహం లేదు. వారి జీవితంలోని ప్రత్యక్షరమూ జ్ఞానమయమే. పరమ పవిత్రమే. వారి జీవిత ఘట్టాల నుంచి తెలుసుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి.

భారతదేశం ఆర్షావని. దైవస్పృశ్ట పులకితగాత్ర. కాబట్టి దీని ప్రతి అణువూ పవిత్రం,పావనం. ఆదిశంకరాది ఆధ్యాత్మిక పితామహులవతరించిన మలయాళగడ్డ మరీ మహోత్కృష్టం. జ్ఞానవిజ్ఞాన క్షేత్రం. శ్రీకృష్ణక్షేత్రంగా ప్రసిద్ధివహించిన గురువాయూర్ ఇక్కడే వుంది. దీని సమీపంలోనే ఎంగ్యండూరనే గ్రామముంది. ఈ గ్రామం సామాన్య గ్రామం కాదు. ఒక మహర్షికి, సద్గురువుకు జన్మనిచ్చిన గ్రామం. ఇక్కడే కరియప్పా నొట్టియమ్మ దంపతులకు స్వాములవారు జన్మించారు. తల్లిదండ్రులు వారికి పెట్టిన పేరు వేలప్ప. అది మహాజ్ఞానిగా ప్రసిద్ధివహించిన సుబ్రహ్మణ్యస్వామి పేరు. పేరు కాకతాళీయమే కావచ్చు. దైవసంకల్పంతో వారు మహాజ్ఞాని కావడానికి దోహదమేర్పడింది.

వేలప్ప బాల్యంలోనే ఒక సంఘటన చోటుచేసుకొంది. వేటగాడి దగ్గర పక్షులను కొని ఆ బాలుడు వాటిని ఆకాశంలోకి ఎగురవేసి స్వేచ్ఛను ప్రసాదించాడు. ఇది ఆయన సహజ కారుణ్యాన్ని తెలియజేస్తుంది. బుద్ధుణ్ణి తలపిస్తుంది. దీన్ని అందరూ అనుసరించవలసిన ఆవశ్యకతను బోధిస్తుంది. ఇది భవిష్యత్తులో శిష్యుల, ఆశ్రితుల సంసార బంధవిముక్తిని శ్రీస్వాములవారు కలిగిస్తారనడానికి సంకేతమనవచ్చు.

శ్రీవారికి ఎవరి ప్రేరణా లేకనే చిన్నప్పటి నుంచీ తీవ్రభక్తి, అఖండ వైరాగ్యమూ, ధ్యానం, పూజ, దైవసంబంధ గేయాలు పాడుకోవడం మొదలైనవి చక్కగా అలవడ్డాయి. దీనికి కారణం వారు మునుపటి జన్మలలో చేసిన

సాధనే కావచ్చు. ఈవిషయాన్ని బలపరచేవిధంగా శ్రీకృష్ణభగవానుడు భగవద్గీత ఆరవ అధ్యాయం నలభైవ శ్లోకం నుంచి దాదాపు నలభై ఐదు దాకా వెలిబుచ్చిన అభిప్రాయాలను గమనించవచ్చు. అందువల్ల ప్రతివారూ ఈ నిమిషం నుంచే సాధన ప్రారంభిస్తే సిద్ధికి చేరువ కావచ్చు. తరువాతి జన్మలు మనకు అనుకూలంగానే వస్తాయి.

గురుదేవులు పెరుంగోట్కరై గురుకులంలో ఉన్నప్పుడు వారి గురువు గారు నిర్దేశించిన ఆశ్రమ కార్యక్రమాలు నిర్వర్తిస్తూనే ఆయా రోజు చెప్పిన పాఠాలను రాత్రిపూట మేలుకొని చదివేవారు. అవి పట్టుబడే దాకా విడిచిపెట్టే వారు కారు. అటువంటి పట్టుదలను విద్యార్థులేగాక నేర్చుకోవాలనుకునే ప్రతివారూ అలవరచుకోవాలి. గురువుగారు చెప్పిన విధంగా మసలుకోవడం, తద్వారా ఉన్నతస్థితి పొందడం స్వాములవారి జీవితంలో మరపురాని ఘట్టం. ఇది కూడా అందరికీ అనుసరణీయమే.

సద్గురుస్వాములవారికి పరోపకారబుద్ధి, లోకులను తరింపజేయాలనే తపన బాల్యం నుంచీ ఉండేవి. ఐతే తాము తరించిన పిమ్మటే తక్కిన వారిని తరింపజేయాలని వారు భావించారు. ఆ మహోన్నత లక్ష్యసాధన కోసం అహర్నిశలూ పాటుబడ్డారు. ఎన్ని కష్టాలు వచ్చినా, ఎటువంటి కష్టాలు వచ్చినా ఓర్పుతో, నేర్పుతో ఎదుర్కొన్నారు. అవమానాలను సైతం లక్ష్యపెట్టలేదు. విజయం సాధించేదాకా, సిద్ధి పొందేదాకా విశ్రమించలేదు. వారి కృషి, పట్టుదల, వైరాగ్యమూ సర్వులకూ తప్పక అనుసరించదగినవే.

సద్గురు స్వాములవారు తాము సిద్ధి పొందిన తరువాత కూడా విశ్రమించలేదు. తమలాగే ఇతరులు కూడా సిద్ధి పొందాలని కాంక్షించారు. ఈ ప్రాంతంలో బ్రహ్మ విద్యావ్యాప్తికి శాయశక్తులా కృషి చేశారు. ఆంధ్రదేశంలో అప్పుడు ఆధ్యాత్మ వాతావరణముండేదికాదు. స్వాములవారు

ఏర్పేడు దగ్గర శ్రీవ్యాసాశ్రమాన్ని స్థాపించారు. అనేకచోట్ల ఆశ్రమాలు నిర్మింపజేశారు. స్త్రీలు, శూద్రులు ఓంకారం చెప్పడం కానీ, ఉపనిషత్తులూ, భగవద్గీత మొదలైన పారమార్థిక గ్రంథాలు చదవడం కానీ ఆ రోజుల్లో నిషిద్ధం. సంస్కృతం చదవడం పెద్ద నేరం. స్వాములవారు వీటన్నిటినీ ఎదుర్కొన్నారు. స్త్రీలకు,శూద్రులకు కూడా అన్నిటికీ అర్హత ఉందని సశాస్త్రీయంగా నిరూపించారు. కుహనా సనాతన వాదుల గొంతు మూగ బొయ్యేట్టు చేశారు. శ్రీవ్యాసాశ్రమంలోనే సంస్కృత పాఠశాల నెలకొల్పారు. ఎందరెందరినో ఉద్దండ సంస్కృత పండితులను తయారు చేశారు. స్త్రీల కోసం కన్యాగురుకుల పాఠశాలనేర్పాటు చేశారు. యథార్థ భారతి అనే పేరుతో ఒక ఆధ్యాత్మ మాసపత్రికను ప్రారంభించారు. తెలుగుదేశంలో ఆధ్యాత్మ వాతావరణమేర్పడడానికి నిరంతరమూ కృషి చేశారు. అనేక ప్రదేశాలకు వెళ్ళి ఉపన్యాసాలిచ్చారు. సనాతన వేదాంత జ్ఞానసభలూ, ఓంకార సత్రయాగాలూ పెక్కు చోట్ల జరిపించారు. ఇప్పుడీ ప్రాంతంలో ఎవరైనా దైవచింతన చేస్తున్నారంటే అది వారి చలవే. స్వాములవారి చొరవవల్ల చాలామంది సంస్కృతాన్ని అభ్యసించారు. దాని వ్యాప్తికి కృషి చేశారు. పారమార్థిక సాహిత్యం విరివిగా ఆంధ్రదేశమంతటా వ్యాపించింది.

స్వాములవారు తమ జీవితంలో పాటించిన పద్ధతులు ప్రతివారూ పాటించదగినవే. వారు అన్ని మతాలనూ సమానంగానే చూశారు. పరమత బోధకులను గౌరవించారు. పరమత గ్రంథాలను కూడా ఆదరించారు. నిరుపేదలకు అన్నదానం చేయించడంలో వారికెంతో ప్రీతి. దయగల హృదయమే భగవన్నిలయమని బోధించారు. చరాచర సుఖాభిలాషిగా తమను పేర్కొన్నారు. సోమరితనానికి ఎక్కడా చోటులేదని చాటి చెప్పారు. పురోభివృద్ధిని కోరువారు పూర్వ వృత్తాంతం మరువరాదని హితవు పలికారు. ఇతరుల ఆత్మోన్నతికి అడ్డు తగులరాదని, చేతనైతే సాయపడాలని, తమ

ఆత్మోన్నతికి అడ్డు కలిగితే తొలగించుకొని పురోగమించాలని తెలియజేశారు. వీలైనంత ఎక్కువ కాలం దైవచింతనలోనే గడపాలన్నారు. దేవుడి పట్ల ప్రేమనూ, భక్తినీ పెంపొందించుకోవాలన్నారు. ఇలాంటి బోధనలెన్నో వారి రచనల్లోనూ తదితరాల్లోనూ మనం గ్రహించవచ్చు. వాటినన్నిటినీ పాటిస్తే తప్పక లక్ష్యసిద్ధిని పొందవచ్చు.

మహర్షి సద్గురు మలయాళస్వాములవారు శారీరకంగా మన మధ్య లేరు. ఐతేనేం వారు చేసిన మంచి పనుల ద్వారా, వారు వెలయించిన వేదతుల్య రచనల ద్వారా మనందరిలోనూ ఉన్నారు. ఎక్కడ ఓంకార ముచ్చరింపబడుతుందో, ఎక్కడ గీతాపారాయణమూ ప్రవచనాలు జరుగుతుంటాయో, ఎక్కడ బ్రహ్మనిష్ఠాదులు జరుగుతుంటాయో అక్కడంతా శ్రీవారు తప్పక ఉండి తీరుతారు. దీనిలో ఎటువంటి సందేహమూ లేదు. వారు స్థాపింపజేసిన ఆశ్రమాల్లో, వారి పేరుతో స్థాపింపబడిన వివిధ ఆధ్యాత్మిక సంస్థలలో, వారి శిష్యప్రశిష్యుల్లో సద్గురు మహర్షి సర్వకాలమూ సజీవంగానే ఉంటారు. పైగా సర్వవ్యాపకుడైన సర్వేశ్వరుడిలో కలిసిపోయిన సద్గురు స్వామి సర్వవ్యాప్తులనడంలో విప్రతిపత్తి లేదు. వారి రచనలను చదివి, వారికి సంబంధించిన ఉపన్యాసాలను విని, వారు చెప్పిన వాటిని పాటించి కృతకృత్యులు కావడం మన ప్రస్తుత కర్తవ్యం.

కం. శ్రీమలయాళమునీంద్రుని
ప్రేమమయుని హృదయమందు ప్రీతిని నిలుపన్
పామర రుజ నశియించును
క్షేమం కరగివ్య జ్ఞానసిద్ధియు కలుగున్

(మాఘ పూర్ణిమ శ్రీ మలయాళస్వాములవారి గురుపూజ సందర్భంగా సం॥)

సద్గురు సన్వ సేవా ట్రస్టుకు ఈక్రింది వారు మూలనిధి పంపినారు

(1). కె.శ్రీనివాసరెడ్డి (శ్రీకాళహస్తి)	-	రూ. 25000/
తండ్రి. స్వర్గీయ కె.సి.వెంకట్రెడ్డి (తండ్రి పేరిట భిక్షానిధికి)		
(2). పి.లక్ష్మణమూర్తి (విశాఖపట్టణం)	-	రూ. 10,000/-
(3). ఐ.రవికుమార్ (హైద్రాబాద్) అన్నదాన నిధికి	-	రూ. 10,000/-
(4). ఎస్.సురేష్‌కుమార్ (బెంగుళూరు)	-	రూ. 20,000/-
(5). ఎస్.సురేష్‌కుమార్ (బెంగుళూరు)	-	రూ. 20,000/-
(గోసేవా నిధికి)		

వేదాన్తభేరికి పోషక చందాను ఈ క్రిందివారు పంపినారు

(1). కోటేశ్వరరావు కంచెర్ల (హైద్రాబాద్)	-	రూ. 2000/-
(2). జి.వాణి (బెంగుళూరు)	-	రూ. 2000/-
(3). ఆర్.రాములు (విశాఖపట్నం)	-	రూ. 2,000/-
(4). ఆర్. సత్యం (విశాఖపట్నం)	-	రూ. 2000/-
(5). వి.రంగరాజు (కూకటపల్లి - హైద్రాబాద్)	-	రూ. 5111/-
(6). మోహనయ్య పల్లెర్ల (హైద్రాబాద్)	-	రూ. 2000/-
(7). బి.శ్రీనివాసులు (హైద్రాబాద్)	-	రూ. 2000/-
(8). ఐ.శ్యామసుందర్ (హైద్రాబాద్)	-	రూ. 2000/-
(9). మనోహర్ బంధం (ఉప్పు ముంతల)	-	రూ. 2000/-
(10). హరీష్ అగీర్ (కొండాపూర్, హైద్రాబాద్)	-	రూ. 2000/-
(11). గుబ్బాలక్ష్మి నారాయణ (జడ్చర్ల)	-	రూ. 2000/-
(12). ఎం. అనంతకుమార్ (బిజినపల్లి)	-	రూ. 2000/-
(13). కె.జి.పురుషోత్తం (అనంతపురం)	-	రూ. 2000/-
(14). గుబ్బా వెంకటరమణ (జడ్చర్ల)	-	రూ. 2000/-

వార్తలు

(01). వేదాన్తభేరి సంవత్సర చందాలు 2020 డిశంబరు నెలతో పూర్త అయినవి. వెంటనే సంవత్సర చందాలు పంపి రెన్యూవల్ చేసుకొనమని డిశంబరు, జనవరి భేరిలో వేశాము. కానీ కొందరే రెన్యూవల్ చేసుకొన్నారు. మిగతావారు గూడ రూ.100/-లు ఎం.ఓ. చేసి రెన్యూవల్ చేసుకో గోరుచున్నాము. చందా పంపనివారికి మార్చి నుండి పత్రికలు ఆపి వేయబడును.

జీవిత చందాదారులకు (ఎల్ గుర్తు) డిశంబరులో చందాలు ముగిసినవి. జనవరి నుండి పత్రికలు ఆపివేశాము. వీరు రెండు వేల రూపాయలు ఎం.ఓ.పంపి పోషకులుగా చేర గోరుచున్నాము. పోషక **(పి గుర్తు) చందాదారులకు** ఎప్పటికీ పత్రికలు పంపబడును. **వారు మరల చందా కట్టపనిలేదు.** పత్రిక చాలా నష్టంతో నడుస్తూంది. గమనించగలరు.

(02). 30-12-2020 తేది పౌర్ణమిరోజు శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామ గిరిజన కాలనీలో పూజచేసి, భజనలు చేసి నైవేద్యం పెట్టి గిరిజన కాలనీ వాసులకు అన్నదానం - ఆశ్రమ సద్గురు సర్వ సేవా ట్రస్టుచే చేయబడినది.

(03). 12-01-2021 తేది స్వామి వివేకానన్ద జయన్తి ఆశ్రమంలో జరిగినది. స్వామి వివేకానందపై ప్రవచనలు జరిగినవి.

(04). 14-01-2021 సంక్రాన్తినాడు ఆశ్రమంలో విశేష పూజలు జరిగినది.

(05). భక్త కన్నప్ప కంటి ఆసుపత్రి 2021 జనవరి నుండి మరల ప్రారంభింపబడినది. ఓ.పి. మఱియు కంటి ఆపరేషన్లు జరుగుచున్నవి. డిశంబరు నెలలో ఓ.పి.విభాగంలో 183 మందికి కంటి పరీక్షలు చేసి వారిలో 8 మందికి ఐ.ఓ.ఎల్. సర్జరీలూ చేసి కళ్ళలో లెన్సు అమర్చబడినవి.

30-12-2020 పౌర్ణమి రోజు వేడెం గ్రామ గిరిజన కాలనీలో పూజ
శ్రీ శుకబ్రహ్మాశ్రమ సద్గురు సర్వసేవా ట్రస్టు వారిచే
గిరిజనులకు అన్నదానం

Regd.No. TRP / 123 / 2021 - 23 February 2021 Rs.10/- R.No.8139/63
Date of Publication 26-01-2021, Permitted to post : 29th, 30th every month.

ఈ పేజి స్థల దాతలు

సుభద్రా చారిటబుల్ ట్రస్టు

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం